# గువ్వలచెన్నని కథ

శ్రీమతి బురాడ లక్ష్మీనరసమ్మగారు

శ్రీ కృష్ణదేవరాయలయొక్క సభాస్థానములో ఆస్థానపండితులుగనున్న అష్టదిగ్గజములలో పేరెన్నికనుగన్న భట్టుమూర్తి (రామరాజభూషణుడు) అని అందరికు దెలిసిన విషయమే. ఒకనాడీయన గ్రామాంతరం వెళ్లుటకు బయలుదేరి "నేను గ్రామాంతరం వెళ్లవలసియున్నది. నేను వచ్చేసరికి వారం రోజులు కాగలదు. ఇంటిలో జాగ్రత్త" యని భార్యతో చెప్పగా నామె సంతోషించి "నాథా! గ్రామాంతరము వెళ్లిన నా ప్రాణాంతరం కాగలదు. భగవంతుని దయచేత మనకు వంటకొఱకు గలదు కాని వంటచెరకులేదు. ఈసంగతి మీకు దెలియ జేయుట ముఖ్యముగాన నాయందు గరుణించి యీ వారంరోజులకు దగిన వంటచెరకు నింటబడవైచి మీరు గ్రామాంతరం వెళ్లడం ఉభయసమ్మతి"ముని చెప్పగా భట్టుమూర్తి అందులకంగీకరించి వీధిలో నెవరితోనైన చెప్పెదనని బయలుదేరి యా సంగతి మరచి కొంతదూరము పోయేసరికి స్నేహితులు కలసి మాట్లాడుచు నాతని గొనిపోయిరి.

ఈ సంగతినంతయు గువ్వలచెన్న డనే కట్టెలవాడు విని, సంతోషించి ప్రతిదిన మందొక్కొక్క కట్టెలమోపు దీసికొనివచ్చి భట్టుమూర్తిగారి పెరటి గుమ్మములో బడవేయుచు బోవుచుండెను. ఈ సంగతి భట్టుమూర్తిగారిభార్య చూచి భర్తగారే యిట్లుసమకూర్చిరని తలచుచుండెను. వారం రోజులు పూర్తియైనవి. రామరాజభూషణుడు స్వగ్రామమునకు విచ్చేసెను. తరువాత కొంతసేపటికి భట్టుమూర్తి భోజనముచేస్తూ కట్టెలెట్లు సమకూరినవని భార్య నడుగగా యదార్థమామె వివరించెను.

ఆ కట్టెలువేయున దెవరోయని రామరాజభూషణుడు వాడు తెలిసికొనుట కింట నేయుండగా నెప్పటి యట్లే కట్టెలమోపుపడినది. ఆసమయము గని యావలనున్న గువ్వలచెన్నని గాంచి "గువ్వలచెన్నా! నీ బుద్ధివిశేషమును గొనియాడవలసి యున్నది. నీ కేమి కావలయునో కోరుకొనుము. తప్పక యిచ్చెద" ననగా, "అయ్యా! మీకు నాయెడ నట్టియనుగ్రహము గలిగినయెడల కీర్తివంతమైనదియు, బహువురచే గొనియాడబడినదియు, తనువు నశించినను నశింపనిదియునైన కృతి కావలె" ననగా, భట్టుమూర్తి,

కం॥ సారాసారము తెలుగని<br>
జేరజుకు బుద్దిసెప్ప పెద్దలవశమా<br>
నీరెంతపోసి పెంచిన<br>
గూరౌనా నేలవేము గువ్వలచెన్నా.

కం॥ కలిమిగలనాఁడె మనుజుడు<br>
విలసనముగుకీర్తిచేత వెలయుగవలెరా<br>
కలిమెంత, యెల్లకాలము<br>
కులగిరులారా? కదలకుండ గువ్వలచెన్నా.

కం॥ ధనమే మైత్రినిదెచ్చును<br>
ధనమే వైరమునుదెచ్చు ధనమే సభలన్<br>
ఘనతనుదెచ్చును నెంతటి<br>
గొనముల కుప్పలకునైన గువ్వలచెన్నా.

ఈలాంటి పద్యములతో నొక పుస్తకము రచించి గువ్వలచెన్ననకు గృతినిచ్చెను. రామనాథ శాస్త్రి గారి గ్రామఫోను పాటలవలె లోకమంతయు గువ్వల చెన్నని పద్యములు విస్తరించెను. గువ్వలచెన్నడు తనకెదురుగుండా ఈ పద్యము లెవ్వరు చదివెదరో తనవద్ద నేమియున్నను వారి కదియొసంగుచుండెడు వాఁడు. ఒకనాడు పిల్లలు వేళాకోళమునకు జదువుచుండగా గువ్వలచెన్నడు కట్టెలసొమ్ము వారికి పంచి పెట్టెనట. ఒకనికి తనుకట్టులు కొట్టుకొను గొడ్డలి నిచ్చివేసెనట. ఈవిధముగా దనవద్ద నేమియున్నను నిచ్చేవాడట. దాతృత్వమన్న గువ్వలచెన్ననిదే కదా! ఈ పద్యములు రారాజైన కృష్ణదేవరాయలకట్లో తెలిసి యాస్థానకవులను బ్రశ్నింపగా రామ రాజభూషణుడులేచి "నేను"అనెను. "ఎందువల్ల నా

గువ్వలచెన్నునికి గృతినిచ్చితి" వన "వానివద్దనున్న దాతృత్వమునకు మెచ్చి యిచ్చితి" ననెను.

రాజుగారు గువ్వలచెన్నుని దాతృత్వము బరిశీలింప భట్టుమూర్తితో బయలుదేరి యొక కోనేటి యొడ్డున చేపలబట్టుచుండగా జూచెను. గువ్వల చెన్నా! అని పిలిచి భట్టుమూర్తిగా రొక పద్యము జదివెను. అప్పుడు గువ్వలచెన్నడు తనవద్ద నేమియు లేకునికి నీటిలో గూర్చొనియుండి తన గోచినివిప్పి పిడిచివైచి భట్టుమూర్తిని దీసికొనమనెను. వెంటనే కృష్ణదేవరాయలు మరియొక పద్యము జదివి "గువ్వల చెన్నా, నా కేమియిచ్చెద" వని యడుగగా గువ్వల చెన్నడు "నేను కోనేటిని గట్టుకొని గోచినిచ్చితిని. నా భార్యకు నిల్లుగట్టుకొనుమని చెప్పి యామె వద్ద చీరను నీవు పుచ్చుకొను" మని చెప్పగా రాయలాతని దాతృత్వమునకు లోలోన సంతసించుచుండెను. పిదప ఆతని భార్యవద్దకు వెళ్లి చీరనిమ్మనగా నామె తలుపుచాటుననుండి చీరను బారవైచి తలుపువైచుకొని యీశ్వరధ్యానము జేయుచు భర్త వచ్చువరకు గాలక్షేపము సేయుచుండెను.

కృష్ణదేవరాయలు తనలో నిట్లు తలపోసెను. "ఆహా! ఆ పుణ్యదంపతుల నడవడి నేమని కొనియాడెదను. ఇంత ధనవంతుడనయ్యు నావద్ద నంతటి దాతృత్వములేదు. దాతృత్వముమాట యట్లుండ నాతని భార్య యనుకూలత్వము, సౌశీల్యము, భర్తృవాక్యపరిపాలనము వింతగొలుపుచున్నవే. ఆమె పాతివ్రత్యమే పాతివ్రత్యము. గువ్వలచెన్నుని దాతృత్వమే దాతృత్వమని సర్వకాలములయందు తలచుచుండెను. గువ్వలచెన్నడు రాజుగారి దయకు బాత్రుడై ధనధాన్యసమృద్ధితో దులదూగెననుట వింతయగునా?

---

# నవ్వుమొగము

అధికార్ల సూర్యనారాయణరావుగారు. బి.ఏ., బి.ఎల్.

అమ్మతో అయ్యతో మాటలాడునపుడు
నీదుచెలియలపై ప్రేమ నెరపునపుడు
తోడివారలతో జట్లు కూడునపుడు
అన్ని వేళల జానకీ! నవ్వుమొగమె!

బావవచ్చినాడని చెల్లిపలుకునపుడు
చూచిచూడక నావైపు చూచునపుడు
తెచ్చెనో వింతలని పెట్టెతీయునపుడు
అన్ని వేళల జానకీ! నవ్వు మొగమె!

పలుకకేమియు గనుజూపె పరపినపుడు
తెలుపకుండనె భావంబు తెలసినపుడు
చిన్నితలవంచి నునుసిగ్గుగన్నయపుడు
అన్ని వేళల జానకీ! నవ్వుమొగమె!

పర్వులువచ్చిన మాటలమాను వేళ
చనినయంతనె యేమి లేదనెడు వేళ
తిరిగి యేమేమొ ముచ్చటల్ జరపు వేళ
అన్ని వేళల జానకీ! నవ్వుమొగమె!

చిట్టికోపాల కనుబొమల్ చేర్చువేళ
క్రొత్తసిగ్గుల తళుకులు గూడువేళ
ముద్దుగొంతున రాగాలు మొలచు వేళ
అన్ని వేళల జానకీ! నవ్వుమొగమె!

ఎదురుగాజూడ మెరపులు మెరయుచుండు
వలువ ముఖముగప్పిన కనుల్కులుకుచుండు
మోమునంత్రిప్ప చెక్కిళ్లు మురియుచుండు
అన్ని వేళల జానకీ! నవ్వుమొగమె!

ఏమియో యోచనల మనంబెగయుచున్న
గలచుతలపులులేక నిశ్చలతగన్న
కనులు మూసిన తెరచిన గానిపించు
నన్ని వేళల జానకీ! నవ్వుమొగమె!

చిరునగవులేక యొకమాట చెప్పలేవు
చిరునగవులేక యేపని చేయలేవు
నవ్వువితనాల నెన్నిటి నాటినావొ?
అన్ని వేళల జానకీ! నవ్వుమొగమె!